# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 30 మే 2024 | HYDERABAD




**అమ్మ ఆదర్శ పాఠశాలల్లో** చేపట్టిన పనులను జూన్ 10లోపు పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో బుధవారం విద్యాశాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. పనుల పురోగతిని పర్యవేక్షించి ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేయాలని సూచించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో 384 పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఆరు ఏండ్ల వయస్సు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, డీఈవో రోహిణి తదితరులు పాల్గొన్నారు.

**-సిటీబ్యూరో, మే 29**
**(నమస్తే తెలంగాణ )**




## ఆడుకుంటూ..

మాదన్నపేట, మే 29: ఆడుకుంటూ ప్రమాదవశాత్తు భవనం పై నుంచి పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన ఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంతోష్‌నగర్ కాలనీకి చెందిన సయ్యద్ అహ్మద్ (8) మదర్సాలో చదువుతున్నాడు. మూడో అంతస్తులో ఉండే తన ఇంట్లో ఆడుకుంటూ.. రక్షణ కవచం లేని కిటికీ నుంచి పడి చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మహేశ్వరంలోనే ఏఐ సిటీ!

### అనేక సానుకూలాంశాలే కారణం
### ఔటర్‌తో అనుసంధానం..
### సమీపంలో విమానాశ్రయం
### అనువైన స్థలాల పరిశీలన



సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): కొత్తగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషిల్ ఇంటెలిజెన్స్) ప్రపంచ పోకడనే మార్చివేస్తోంది. ఐటీ రంగంలోనే కాదు ప్రతి రంగంతోనూ ఏఐ పెనవేసుకుంటోంది.మనుషులు చేయాల్సిన పనులన్నీ ఎంచక్కా ఏఐ చేసేస్తోంది. ఇది ఒక రకంగా ప్రమాదకరమని తెలిసినా.. దాని వెంటే ప్రపంచమంతా నడుస్తోంది. అందుకు ఉదాహరణ... గూగుల్, మైక్రోసాఫ్ట్, మేటా వంటి కంపెనీలు ఏఐ టెక్నాలజీతోనే రకరకాల అప్లికేషన్, సెర్చ్ ఇంజన్లను రూపొందిస్తున్నారు. ఇక ఇతర కంపెనీలు ఏఐ టూల్స్ పేరుతో ప్రతి పనికి ఓ ఏఐ టూల్స్ అన్నట్లు రూపొందించి అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. అలాంటి కృత్రిమ మేధస్సు ప్రాధాన్యతను గత కేసీఆర్ ప్రభుత్వంలోనే అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ గుర్తించి.. ప్రత్యేకంగా ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్‌ను, అదేవిధంగా తెలంగాణ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ (టీ-ఎయిమ్) పేరుతో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. ఇందుకు అనుగుణంగా రోజు రోజుకు ఏఐ టెక్నాలజీ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోంది. తాజాగా, తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఏఐకి అధిక ప్రాధాన్యతనిస్తోంది. ఇప్పుడు ఏకంగా ఏఐ సిటీని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు మొదలు పెట్టింది. పరిశ్రమల కోసం ఏర్పాటు చేసే సెజ్ తరహాలోనే ఏఐ సిటీని సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమైంది.

### అనుకూలంగా మహేశ్వరం..

కొత్తగా ఏర్పాటు చేసే ఏఐ సిటీని నగరంలో ఐటీ కారిడార్‌గా ఉన్న మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో కాకుండా మరో చోట ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఐటీ కారిడార్‌లో రద్దీ గణనీయంగా పెరగడంతో ట్రాఫిక్ ఇబ్బందులకు దారి తీసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న ఏఐ కోసం ప్రత్యేకంగా ఒక నగరాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఔటర్ రింగు రోడ్డు వెంబడి విశాలమైన ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే రెండు, మూడు ప్రాంతాలను అనుకున్నా, అందులో మహేశ్వరం అయితేనే అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందనే అభిప్రాయానికి ఐటీ శాఖ అధికారులు వచ్చారు. ఓఆర్ఆర్‌తో అనుసంధానంతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉండటం, ప్రస్తుతం మహేశ్వరం చుట్టు పక్కల ప్రాంతాల్లో నివాసం, పరిశ్రమల పరంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో ఏఐ సిటీని ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతం మరింత అభివృద్ధికి దారి తీసి, ఆ చుట్టు ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు. ఓఆర్ఆర్ నుంచి కేవలం 4-5 కి.మీ పరిధిలో, ఎయిర్‌పోర్టు నుంచి 15 కి.మీ పరిధిలోనే ఉండేలా స్థలాలను ఎంపిక చేస్తున్నారు. ముఖ్యంగా గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ఫార్మాసిటీ ప్రాజెక్టులోనూ వేలాది ఎకరాలు అందుబాటులో ఉండటంతో అక్కడ సైతం ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. మొత్తం మహేశ్వరం చుట్టు పక్కల ప్రాంతాల్లోనే ఏఐ సిటీ ఏర్పాటుకు ఎంతో అనుకూలమనే అభిప్రాయాన్ని ప్రభుత్వంతో పాటు ఐటీ రంగ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

### జూలైలో గ్లోబల్ ఏఐ సమ్మిట్..

ఐటీ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడంపై తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ ప్రత్యేకంగా చొరవ తీసుకుంటోంది. ఎమర్జింగ్ టెక్నాలజీల్లో ఒకటైన కృతిమ మేధస్సుపై ప్రత్యేకంగా గ్లోబల్ ఏఐ సమ్మిట్‌ను నిర్వహించాలని షెడ్యూలును ఖరారు చేసింది. జూలైలో అంతర్జాతీయ స్థాయిలో ఏఐ సమ్మిట్‌ను నిర్వహించనున్నారు. ఆ సమయానికి కల్లా ఏఐ సిటీకి సంబంధించిన స్థలాన్ని ఎంపిక చేయడంతో పాటు అక్కడ నిర్మాణానికి సంబంధించిన ఫౌండేషన్ పనులు ప్రారంభించే అవకాశం ఉందని ఐటీ శాఖకు చెందిన అధికారి ఒకరు తెలిపారు. ఈ గ్లోబల్ ఏఐ సమ్మిట్ ద్వారా యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా ఏఐ నిపుణులు పుష్కలంగా అందుబాటులో ఉన్నారు. దీనికి తోడు ఇక్కడి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏఐ స్పెషలైజేషన్‌లో కోర్సులు ఉన్నాయి. ఫలితంగా ఏఐలో నైపుణ్యం కలిగిన మానవవనరుల లభ్యత ఇక్కడ ఉండటంతో ఏఐ సిటీకి ఎంతో భవిష్యత్ ఉంటుందని భావిస్తున్నామని అధికారి పేర్కొన్నారు.




కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించిన శశాంక్‌ను సన్మానిస్తున్న జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి

## కరాటే చాంప్‌లో విజేతగా..

సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ ) : జలమండలి ఉద్యోగి కుమారుడు అంతర్జాతీయ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. డివిజన్ -8లో టీజీ-2గా పనిచేస్తున్న పురాన్ సింగ్ కుమారుడు శశాంక్ సింగ్ మలేషియాలో జరిగిన అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించాడు. శశాంక్‌ను జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ కరాటే పోటీల్లో 27 దేశాల నుంచి పిల్లలు పోటీ పడగా, మన దేశం తరపున శశాంక్ గోల్డ్ మెడల్ సాధించాడు. శశాంక్‌కు ప్రస్తుతం ఎనిదేండ్లు అని, ఐదేండ్ల నుంచి శిక్షణ ఇస్తున్నట్లు తండ్రి పురాన్ సింగ్ తెలిపారు.

## జూన్ 7న ఇండియా ఆర్ట్ ఫెస్టివల్

సిటీబ్యూరో, మే 29(నమస్తే తెలంగాణ): జూన్ 7 నుంచి 9 వరకు రేతిబౌలిలోని కింగ్స్ కొహినూర్ కన్వెన్షన్ సెంటర్‌లో 'ఇండియా ఆర్ట్ ఫెస్టివల్' కొలువుదీరుతున్నదని నిర్వాహకులు బుధవారం పేర్కొన్నారు. ఇందులో 250 మంది కళాకారులు, 30 ఆర్ట్ గ్యాలరీలు, 3,500 కళాఖండాలతో ఎగ్జిబిషన్ జరుగుతుందని తెలిపారు. జూన్ 7న ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ఆర్ట్ ఫెస్టివల్ జూన్ 9న రాత్రి గంటలకు ముగుస్తుందని వెల్లడించారు.



**పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర అవతరణ ఏర్పాట్లు**

పరేడ్‌గ్రౌండ్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లను జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బుధవారం పరిశీలించారు. సభా ప్రాంగణంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లు ఉండాలని, వీఐపీ రాకపోకలకు ఇబ్బందులు రాకుండా చేపట్టబోయే చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మేయర్ వెంట ఎమ్మెల్సీ వెంకట్, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, అంబర్‌పేట కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ రోహిణ్‌రెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ రాజశేఖర్ ఉన్నారు. -సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ)


## అవయవదానంతో ప్రాణాలు నిలిపి..

### పలువురి జీవితాల్లో వెలుగు నింపిన అన్నదాత



మావిళ్ల వెంకటయ్య (ఫైల్)

మన్సూరాబాద్, మే 29: తాను మరణిస్తూ.. పలువురి జీవితాల్లో వెలుగులు నింపాడో అన్నదాత. నల్గొండ జిల్లా, చింతపల్లికి చెందిన మావిళ్ల వెంకటయ్య (34) వ్యవసాయం చేస్తుంటాడు. ఈనెల 24న వెంకటయ్య బైకుపై చింతపల్లిలోని వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్తుండగా, భారీ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని.. చికిత్స కోసం ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానకు తరలించారు. ఐసీయూలో ఉంచి ఐదు రోజుల పాటు చికిత్స అందించినా.. ఆరోగ్యం కుదుటపడలేదు. వెంకటయ్య ఈనెల 28న బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్లు వైద్యులు గుర్తించారు. విషయాన్ని తెలుసుకున్న జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు మృతుడి భార్య పార్వతమ్మతో పాటు కుటుంబసభ్యులను కలిసి అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో అవయవదానానికి వారు ముందుకురాగా, వెంకటయ్యకు చెందిన రెండు మూత్రపిండాలు, లివర్, రెండు కార్నియాలను దానం చేశారు.



## గ్రేటర్ @40.2

సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): వానలతో మొన్నటి వరకు చల్లబడిన గ్రేటర్ వాతావరణం మళ్లీ ఒక్కసారిగా వేడెక్కింది. రెండు మూడు రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఏకంగా 40 డిగ్రీలు దాటి నమోదవుతుండటంతో పగటి పూట జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. కిందిస్థాయి గాలులు పశ్చిమ దిశ నుంచి తెలంగాణ వైపునకు వీస్తుండటంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి దాటి నమోదవుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 40.2, కనిష్ఠం 27.3 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 32 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా జూన్ 1, 2 తేదీల్లో గ్రేటర్‌కు వర్షసూచన ఉన్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

## నాణ్యమైన విద్యుత్తే లక్ష్యం

### సంస్థాగత బలోపేతానికి టీజీఎస్‌పీడీసీఎల్ శ్రీకారం
### గ్రేటర్ డిస్కం పరిధిలో మార్పులు
### అధ్యయనం చేయనున్న ప్రత్యేక కమిటీ



సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. కోర్ సిటీతో పాటు నగర శివారు ప్రాంతాల్లో పట్టణీకరణ శరవేగంగా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో మౌలిక వసతుల్లో ఎంతో కీలకమైన విద్యుత్ సరఫరాను ఇందుకు అనుగుణంగా అందించాల్సిన అవసరం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థపై ఉన్నది. ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే గ్రేటర్ పరిధిలో రికార్డు స్థాయిలో కరెంటు డిమాండ్ నమోదైంది. దానికి అనుగుణంగానే క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారులు, ఉద్యోగులంతా మెరుగైన సరఫరాను అందించేందుకు శ్రమించారు. కాగా, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా కరెంటు అవసరాలను తీర్చేందుకు క్షేత్రస్థాయిలో కీలకమైన విద్యుత్ లైన్ల విభాగాలను పునర్విభజన చేసేందుకు టీజీఎస్‌పీసీఎల్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా కమిటీని నియమించింది. గ్రేటర్ మెట్రో జోన్ పరిధిలో అధ్యయనం కోసం కమిటీ సభ్యులుగా మెట్రో జోన్ సీజీఎం నర్సింహాస్వామి, రంగారెడ్డి జోన్ సీజీఎం ఆనంద్, మేడ్చల్ జోన్ సీజీఎం సాయిబాబా, సైబర్ సిటీ సర్కిల్ ఎస్ఈ వెంకన్నను నియమించారు.

### క్షేత్ర స్థాయిలో మెరుగైన పనితీరు..

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తెలంగాణ రాష్ట్రంలోని 15 జిల్లాల్లో విస్తరించి ఉంది. మొత్తం కనెక్షన్లు కోటి 11 లక్షలు ఉండగా, అందులో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల పరిధిలోనే సుమారు 60 లక్షలు ఉన్నాయి. ప్రతి నెలా కొత్తగా వేల సంఖ్యలోనే వినియోగదారులు చేరుతున్నారు. వీరందరికీ అంతరాయం లేని సరఫరాను అందించాలంటే.. కరెంటు లైన్ల వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరమున్నది. ఈ నేపథ్యంలో సమగ్రంగా అధ్యయనం చేసేందుకే డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ కమిటీని నియమించారు. విద్యుత్ లైన్ల విభాగాన్ని పునర్విభజన చేయడంతో పాటు సబ్ ఇంజినీర్లు, సెక్షన్ కార్యాలయాల పరిధిలోని అధికారుల పని విధానాలను నిర్ణయించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి.. జూన్ 3 వరకు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. మొత్తంగా క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన అంశాలపై ఈ కమిటీ పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించి.. నివేదికను రూపొందించి సీఎండీకి అందజేయాల్సి ఉంటుంది.

## అర్హత లేకున్నా..

### చికిత్స.. ఔషధాల విక్రయం

### ఆర్ఎంపీ క్లినిక్‌పై డీసీఏ దాడి.. 17 రకాల ఔషధాలు సీజ్

సిటీబ్యూరో: అర్హత లేకుండా చికిత్స చేయడంతో పాటు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అనుమతి లేకుండానే ఔషధాలు విక్రయిస్తున్న ఆర్ఎంపీ క్లినిక్‌పై డీసీఏ అధికారులు దాడులు జరిపారు. అనుమతి లేకుండా విక్రయిస్తున్న 17 రకాల ఔషధాలను సీజ్ చేయడంతో పాటు అర్హత లేకుండా మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్న మహిళకు నోటీసులు జారీ చేశారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం...గచ్చిబౌలిలోని సిద్ధిక్‌నగర్‌లో స్థానికంగా నివాసముండే స్వరూప అదే ప్రాంతంలో 'స్వరూప ఫస్ట్ ఎయిడ్ సెంటర్' పేరుతో క్లినిక్‌ను నిర్వహిస్తూ అర్హత లేకున్నా రోగులకు చికిత్స చేస్తున్నారు. అంతే కాకుండా డీసీఏ అనుమతి లేకుండానే ఔషధాలు సైతం అమ్ముతున్నారు. సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు బుధవారం క్లినిక్‌పై దాడులు జరిపి.. పలు ఔషధాలను సీజ్ చేశారు. అర్హత లేకున్నా మెడికల్ ప్రాక్టీస్ చేస్తూ, ఔషధాలు విక్రయిస్తున్న స్వరూపకు నోటీసులు జారీ చేశారు.

### నిబంధనలకు విరుద్ధంగా ప్రకటనలు

నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలపై ప్రకటనలు ముద్రిస్తున్న పలు ఔషధ తయారీ కంపెనీలకు డీసీఏ అధికారులు నోటీసులు జారీ చేశారు. కాప్రా, ఖమ్మం పరిధిలో 'పీ-మైసటిన్' అయింట్‌మెంట్‌పై కంటి జబ్బుల నివారణకు అంటూ నిబంధనలకు విరుద్ధంగా ప్రకటనలు ముద్రించారు. సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు.. కాప్రా పరిధిలోని పలు మెడికల్ షాపులపై దాడులు జరిపి నిబంధనలకు విరుద్ధంగా ప్రకటనలు ముద్రించిన పీ-మైసటిన్ మందులను సీజ్ చేశారు. అయింట్‌మెంట్ తయారీ కంపెనీ ఈస్టర్న్ హెల్త్‌కేర్‌కు నోటీసులు జారీ చేశారు. మరో కేసులో ఖమ్మం జిల్లాలో 'మహా సుదర్శన కాఢ'పై జ్వరం నివారణ పేరుతో ప్రకటనలు ముద్రించారు. డీసీఏ అధికారులు కాప్రా, ఖమ్మం జిల్లాలోని పలు మెడికల్ షాపులపై దాడులు జరిపి, ప్రకటనలు ముద్రించి ఉన్న ఔషధాలను సీజ్ చేసి, వాటి తయారీ కంపెనీలకు నోటీసులు జారీ చేశారు.

### నిర్ణీత ధరల కంటే అధిక రేట్లకు..

అధిక రేట్లకు విక్రయిస్తున్న ఔషధాలను డీసీఏ అధికారులు సీజ్ చేసి.. తయారీ కంపెనీలకు నోటీసులు జారీ చేశారు. 'ఇట్రాకాంజోల్ క్యాప్సుల్స్-200 ఎంజీ' పది మాత్రల ధర అన్ని రకాల పన్నులతో కలిపి రూ. 247.7కు విక్రయించాలి. కానీ 'సఫిక్స్' అనే ఔషధ తయారీ కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా 10 మాత్రలను రూ. 298కి విక్రయిస్తోంది. అంటే ప్రతి 10 మాత్రలపై రూ. 50.30 అధికంగా వసూలు చేస్తోంది. సమాచారం అందుకున్న డీఏసీ అధికారులు శామీర్‌పేటలోని పలు మెడికల్ షాపులపై దాడులు జరిపి.. అధిక ధరలకు విక్రయిస్తున్న ఔషధాలను సీజ్ చేసి, తయారీ కంపెనీ 'సఫిక్స్'కు నోటీసులు జారీ చేశారు.



మందులను స్వాధీనం చేసుకున్న డీసీఏ అధికారులు